ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025 5 శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులు

బీడి కార్మికులను ఆదుకోండి

కదిరిలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో బీడీలు చుట్టి జీవనం సాగించే బీడీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారిని ఆదుకోవాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశాన్ని కో కన్వీనర్ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓబులు మాట్లాడుతూ బీడీ కార్మికులకు ప్రభుత్వమే నేరుగా గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కదిరిలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించే చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యం పొగాకుతో పని చేయడం వల్ల బీడీ కార్మికులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1000 బీడీలు చుడితే ఇస్తున్న కూలి 230 రూపాయలు మాత్రమే అని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ పరిశ్రమ పై విధించే జీఎస్టీ డబ్బులు నుంచి బీడీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల చివరలో జరుగుతున్న రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలలోనైనా బీడీ కార్మికుల గురించి చర్చించి వారి సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కో కన్వీనర్ ఇక్బాల్ హుస్సేన్, ఉమాగౌడ్, మున్నీ, చంద్రకళ, హసిన్ తాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్.నరసింహులు, పట్టణ కమిటీ నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, రఫిక్, ఉదయ్, బాబ్జాన్, ఆంజనేయులు, రఫీ పాల్గొన్నారు.

కూటమి నేతల భూ పంచాయితీ

జిల్లాలో కూటమి పార్టీలైన టిడిపి, బిజెపి నేతల మధ్య భూ పంచాయతీ తారా స్థాయి చేరుతోంది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు భాగస్వామ్యుల మధ్య గత కొన్ని రోజులుగా మాటల యుద్ధం నడుస్తోంది. 250 ఎకరాల భూ పంచాయతీ గడిచిన పదేళ్లుగా ఆ నేతల మధ్య నానుతూనే ఉంది. ఇందులో భాగస్వామ్యులుగా ఉన్న ముఖ్య నేతలు మాత్రం ఇప్పటి వరకు మౌనం వీడలేదు. తమకేమీ సంబంధం లేనట్టుగానే వ్యవహారాన్ని నడిపిస్తున్నారు.



- ◆ భాగస్వామ్యుల మధ్య సాగుతున్న మాటల యుద్ధం
- ◆ ఎవరికి వారు తమదే అంటూ ప్రకటనలు
- ◆ ముఖ్య నేతల మౌనం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సత్యసాయి జిల్లా పెనుకొండ మండల పరిధిలోని గుట్టూరు గ్రామ పరిధిలో 250 ఎకరాల భూమిని 2011 గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీ పేరుతో ఉత్తరాదికి చెందిన వ్యక్తులు కొనుగోలు చేశారు. ఈ కంపెనీ నుంచి 2014లో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ మొదట అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ కొనుగోలు నడుస్తున్న క్రమంలో ఈ ప్రాంతంలో కియా పరిశ్రమ వస్తుందని భావించి తెలుగుదేశం పార్టీ అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి, బిజెపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డిలు 2016లో గ్లోబల్ హార్టికల్చర్ కంపెనీ కొనుగోలుకు ముందుకొచ్చారు. ఆదినారాయణతో కలసి ముగ్గురు భాగస్వామ్యులుగా కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో పల్లె రఘునాథరెడ్డి 40 శాతం వాటా, ఆదినారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు చెరి 30 శాతం వాటాతో ఉత్తరాది వ్యక్తులు డబ్బులు చెల్లించి సంస్థతోపాటు, ఆ సంస్థ పేరుమీదున్న 250 ఎకరాలను తమ పేరుపై మార్చుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ సంస్థలు డబ్బులు చెల్లించడంలో ఆర్థికపరమైన సమస్యలు తలెత్తడంతో హైదరాబాద్‌కు సంబంధించిన కొంత మంది వ్యక్తులను ఇందులో భాగస్వామ్యులు చేయాలని భావించారు. వారి వల్ల కూడా కాకపోవడంతో 2017లో ప్రభాకర్ అనే వ్యక్తిని సంప్రదించారు. అతను ముందుకు రావడంతో కంపెనీలో ఆయన్ను డైరెక్టర్‌గా నియమించుకున్నారు. ఆ తరువాత అక్కడ భూముల ధరలు పెరగడంతో భాగస్వామ్యుల మధ్య వివాదాలు తలెత్తాయి. 2018 నుంచి భాగస్వామ్యుల మధ్య వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. అనేక మార్లు స్థలం వద్దనే ఘర్షణలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి.

ముఖ్య నేతల మౌనం

ఈ భూ వివాదం విషయంలో ముదిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ, భాగస్వామి ప్రభాకర్‌లు ఇటీవలి కాలంలో పరస్పరం మీడియా సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఆరోపణలు చేసుకుంటున్నారు. ఆరోపణలు చేస్తున్న ఆది నారాయణ బిజెపి పార్టీలో ఉన్నారు. ఆయన ఆరో పణలు చేస్తున్నది టిడిపి నాయకులు పల్లె రఘునాథ రెడ్డిపై కావడం గమనార్హం. మరో నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి బిజెపిలో ఉన్నారు. ఈ రకంగా అటు టిడిపి, ఇటు బిజెపి భాగస్వామ్యులుగా ఉన్న ఈ నేతల మధ్య భూ పంచాయితీ తారా స్థాయిలోనే నడుస్తోంది. ఇప్పటి వరకు ఈ విషయంపై ఆదినారాయణ, ప్రభాకర్‌లే పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటు న్నారు. ముఖ్య నేతలు మాత్రం ఈ విషయంపై ఏమీ స్పందించకపోవడం గమనార్హం. అనేక ఏళ్లుగా నడుస్తున్న ఈ భూ పంచాయతీకి ఫుల్‌స్టాప్ పెట్టే పరిస్థితులు కూడా లేకుండా ఉన్నాయి.

హెచ్ఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు

జూన్ 10లోపు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ మ్యాప్ ను పరిశీలిస్తున్న కలెక్టర్

హంద్రీనీవా సుజల స్రవంతి మెయిన్ కాలువ లైనింగ్ పనులు జూన్ 10వ తేదీలోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కోర్టు హాల్‌లో సంబంధిత ఇంజనీర్లతో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు లైనింగ్ పనులకు సంబంధించి మ్యాపులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇవ్వాలని ఆదేశించారన్నారు. రెండవ దశ పనులు 260 కిలోమీటర్ల నుంచి 404 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు నిర్దేశించిన సమయానికి త్వరగతిన పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. మడకశిర కాలువ పరిధిలో ఉన్న చెరువులన్నింటికీ నీరు అందజేయాలన్నారు. జిల్లాలో కాలువ లైనింగ్ పనులు చేపడుతున్నామని సికె పల్లి, కొత్తచెరువు, బుక్కపట్నం, ముదిగుబ్బ, ఎన్‌పి.కుంట, పుంగనూరు కెనాల్ నుంచి కదిరి, నల్లచెరువు, తనకల్లు, మడకశిర బ్రాంచ్ కాలువ నుంచి హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, మడకశిర మండలాల్లో పనులు చేపడుతున్నామని ఇంజనీర్లు కలెక్టర్‌కు వివరించారు. కెనాల్ లైనింగ్ పనులు జూన్ 10లోపు పూర్తి చేయాలని ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్, ఈఈ వెంకటేశు శెట్టి, మురళి అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డిపిఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే 'డయల్ యువర్ డిపిఒ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో శనివారం మొదటిసారిగా ఎస్పీ ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి నెలా నాల్గో శనివారం ఈ కార్యక్రమం జరుతుందని, సిబ్బంది ఫిర్యాదు చేయవచ్చున్నారు. 15 రోజుల్లోపు పరిష్కారం చూపుతారన్నారు. వాట్సప్ మెసేజ్ ద్వారా కూడా పంపవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, సూర్యతేజ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

ప్రజాశక్తి-రొద్దం

కంది రైతులకు ఏమాత్రం ఇబ్బంది కలిగించొద్దని జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు ఏజెన్సీ ప్రతినిధులను అదేశించారు. మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో రైస్ మిల్లులో ఏర్పాటుచేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించి రైతుల నుంచి కందులు కొనుగోలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అయితే రైతులు 3 రోజులుగా ఇక్కడే ఉంటున్నామని తెలపడంతో ఏజెన్సీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేగంగా రిజిస్టర్ చేసుకుని, ట్యాగులు అందజేసిన తర్వాత రైతులను పంపించేయాలని ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కె.స్వయంప్రభ, ఏఓ నివేదిత, మార్క్‌ఫెడ్ డిఎం గీత ఉన్నారు.

బడ్జెట్‌లో సీమకు ప్రాధాన్యమివ్వాలని వినతి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో రాయలసీమకు ప్రత్యేకంగా 42 శాతం నిధులు కేటాయించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రాజశేఖర్ కోరారు. ఈ మేరకు శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో గిరికి వినతి పత్రం ఇచ్చారు. రాజశేఖర్ మాట్లాడుతూ విభజన చట్టం హామీల అమలు, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, సీమలో ఇప్పటికే నెలకొల్పిన ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించడం నిలిపివేత, గుంతకల్లు రైల్వే జోన్ ఏర్పాటు, కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థాపించాలని, హంద్రీనీవా లైనింగ్ పనులు ఆపేసి కాలువ సామర్థ్యం పెంపు, అనంతపురంలో ఉద్యానవన పరిశోధన సంస్థ, వలసల నివారణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు, మడకశిర బ్రాంచ్ కాలువ సామర్థ్యం పెంచి సాగునీరు విడుదల, గాజులపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 1.5 టీఎంసీలకు పెంచి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ రాజశేఖర్, సిఐటియు నాయకులు రమేష్, సిపిఐ నాయకులు శ్రీరాములు, కళాకారులు కోగిర జయచంద్ర, డిగ్రీ కాలేజీ తెలుగు లెక్చరర్ దేవిశెట్టి రామన్న, జాఫర్ పాల్గొన్నారు.

డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-గోరంట్ల

రేషన్‌డీలర్లు సరుకుల తూకాల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహశీల్దార్ మారుతి హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం స్టోర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ సరుకుల తూకాల్లో తేడా వస్తున్నట్లు ఫిర్యాదులు అందుతు న్నాయని, ఇక నుంచి కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. లేనిచో డీలర్లపై చర్యలు తప్పవన్నారు. అలాగే చక్కెర, కంది బేడలు ఇచ్చినప్పుడు చిల్లర ఇవ్వకుండా లబ్ధిదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయకూడదన్నారు. 1 నుంచి 18వ తేదీ వరకూ లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. నోటీసు బోర్డులో సరుకు స్టాక్ వివరాలు పొందుపరచాలన్నారు. సమావేశంలో సిఎస్‌డిటి శ్రీధర్, డీలర్లు పాల్గొన్నారు

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని రేషన డీలర్లు, ఎండియు ఆపరే టర్లతో సమావేశం నిర్వహించారు. సిఎస్‌డిటి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే నిత్యావసర సరుకులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి అవకతవకలు, తూకాల్లో వ్యత్యాసం రాకూడదన్నారు. బయటి వ్యక్తులకు విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-రొద్దం



చేప పిల్లల్ని వదులుతున్న మంత్రి సవిత

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి సవిత తెలిపారు. మంత్రి శనివారం మండలంలోని రొద్దం పెద్ద చెరువులో లక్ష చేప పిల్లలను వదిలారు. ఆమె మాట్లాడుతూ వైసిపి చచ్చిపోయిందని, అందుకే జగన్‌కు మైండ్ దొబ్బిందని, అందుకే ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని మారం చేస్తున్న జగన్‌కు ప్రతిపక్ష హోదా ఎవరు ఇస్తారనేది తెలియదా అని ప్రశ్నించారు. వైసిపి పాలనలో రైతులు పండించిన పంట కంటే, గంజాయి అధికంగా పండిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, మండల కన్వీనర్ నరహరి, టైలర్ ఆంజనేయులు, వెంకటరామిరెడ్డి, అశ్వర్థనారాయణ, చంద్రమౌళి, రామకృష్ణ, కంబాల పల్లి సర్పంచి మంజు, తడంగిపల్లి సర్పంచి మంజు, వీరాంజి, వాల్మీకి చంద్రశేఖర్, గోపాల్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

పెనుకొండ : అనారోగ్య బాధితులకు సిఎం సహాయ నిధి భరోసా అని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి నియోజక వర్గానికి చెందిన 12 మంది బాధితులకు రూ. 5,63,816 చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సిఎం చంద్రబాబు పేదలకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిమర్రి : రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని ఫిష్ డెవలప్మెంట్ అధికారి శంకరయ్య తెలిపారు. మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో శనివారం 7.1 లక్షల చేప పిల్లలను వదిలారు. ముందుగా సిబిఆర్ డ్యాంలో గంగపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ డ్యాంలో చేపల వేట ద్వారా 500కి పైగా కుటుంబాలు జీవిస్తున్నాయని, వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎఫ్ఎ రామాంజనేయులు, ఈఓఆర్‌డి విజయశేఖర్ నాయుడు, మత్స్యకార సంఘం అధ్యక్షులు శివన్న, చౌడప్ప, శివయ్య, రామకృష్ణ, దేవర రామ్మోహన్, నాగార్జున, చింతల వన్నూరురెడ్డి, ఆర్వేటి ఆనంద్, బాసినేని రమణనాయుడు, వీరరాఘవ, అనుగుత్తి రమణ, పార్థసారధి, ఆర్వేటి సదాశివ, నారాయణస్వామి, కప్పల గంగయ్య పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



నిందితులతో వివరాలు తెలుసుకుంటున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారాధికారి హనుమప్ప, న్యాయవాదులు సదాశివరెడ్డి, ప్రసాద్ రెడ్డి, నవేరా, భాగ్య, పారా లీగల్ వాలంటీర్ సురేష్, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్ట వ్యతిరేక నిర్ణయాలపై నిరసన



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కొడిగెనహళ్లి ఫ్రీకాట్ 'బి' ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం కార్మికులకు అన్యా యం చేసేలా కార్మిక చట్టవ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం తగదని సిఐటియు నాయకులు తెలిపారు. యాజమాన్యం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ ఫ్రీకాట్ 'బి' లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్లులో 600 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఈ సంస్థ ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వానికి కానీ, గుర్తింపు యూనియన్‌కు కానీ, కార్మికులకు కానీ కారణాలు చెప్పకుండా ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈ నెల 9వ తేదీ ఉన్న ఫళంగా ముడి సరుకులను వెనక్కి పంపడం, ఉత్పత్తిని ఆపేయడం, కొందరు కార్మికులకు పని లేదని వెనక్కి పంపారని మండిపడ్డారు. యాజమాన్యం బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తూ చట్టవ్యతిరేకంగా సంస్థను మూసివేసే ప్రయత్నాలు చేయడం తగదన్నారు. సంస్థను మూసేస్తే కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయని, కావున యాజమాన్యంతో చర్చించి సంస్థను పున్నప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, జయరామిరెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, కోశాధికారి నందీశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

న్యాయమూర్తి లలితాలక్ష్మిహారిక



ప్రకృతి వైపరీత్యాలపై న్యాయమూర్తికి వివరిస్తున్న విద్యార్థి ఆహీల్



రోబో పని విధానంపై న్యాయమూర్తికి వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతను పెంపొందించుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన టెక్ ఫెస్ట్-2025 అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, పాఠశాల వ్యవస్థపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ముఖ్య అథితులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక స్థాయి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు రూపొందించిన సుమారు 300 ప్రయోగాలను చేశారు. ఇందులో న్యాయమూర్తి రోబో టెక్, అడవుల సంరక్షణ, స్నో వరల్డ్, వర్కింగ్ నమూనాలను పరిశీలన చేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆలోచనలకు పునాదిగా ఎంతగానో దోహదపడతాయన్నారు. రోబో అవసరం, ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే కనుక్కోవడం గురించి రూపొందించిన విధానం చాల బాగుందన్నారు. పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ మానవుని మనుగడ, అభివృద్ధి, రాబోవు తరాలకు అనుగుణంగా ప్రకృతిని కాపాడడం కోసమే విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, అకడమిక్ డైరెక్టర్‌లు స్మిత, నందిత, హెచ్ఎం గాయిత్రి, ఎఒ భాస్కర్, ఎహెచ్ఎంలు విజయేంద్ర, శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం : డిపిఒ

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయ, పంచాయితీ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించి, చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేలా కృషి చేయాలని జిల్లా పంచాయితీ అధికారిణి సమత సిబ్బందికి సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం హిందూపురం రూరల్ మండలం తూమకుంట, కిరికెర, సంతేబిదనూరు గ్రామాల్లో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌ను జిల్లా పంచాయతీ అధికారిణి సమత పరిశీలన చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతు పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యమని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల చెత్తపై క్రిమికీటకాలు చేరి అవి మనం తినే ఆహారం, నీటిలో కలుషితమై ప్రమాదకరమైన మెదడు వాపు, టైఫాయిడ్, కలరా వ్యాధులు వ్యాపిస్తాయని అన్నారు. పంచాయితీ సిబ్బంది గ్రామాల్లో ఉన్న అన్ని చెత్త కుప్పలతో పాటు రోడ్డుకు ఇరు వైపుల పడి ఉన్నా చెత్తతో పాటు పశువుల పేడ దిబ్బలు తొలగించి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. 100 శాతం గ్రామాల్లో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివ కుమార్, గ్రామ సర్పంచులు రత్నమ్మ, చిన్న వీరప్ప, లలిత, మాజీ సర్పంచి రాము, పంచాయితీ కార్యదర్శులు కెంచరాయప్ప, ఇబ్రహీంతోపాటు పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యకు ముందస్తు చర్యలు : ఛైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం



నీటి సరఫరా విభాగం ఇంజనీర్, సిబ్బందితో మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ కుమార్

రానున్న వేసవిని దష్టిలో ఉంచుకుని పట్టణవ్యాప్తంగా ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నీటి సరఫరా విభాగం ఇంజనీర్ జనార్ధన్, సిబ్బందికి మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ సూచించారు. శనివారం నీటి సరఫరా విభాగం హాజరును మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఛైర్మన్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గొల్లపల్లి నుంచి హిందూపురానికి ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకురావడం జరిగిందన్నారు. నీటి సరఫరా విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వార్డు పర్యటనలో భాగంగా శనివారం 9,10 వార్డుల పరిధిలోని లక్ష్మీపురం, శ్రీకంఠపురం ప్రాంతాల్లో ఛైర్మన్ రమేష్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుళ, టిడిపి నాయకులు దుర్గా నవీన్, ఆదిల్, ఆంజనేయులు, వెంకటేష్, ప్రసాదప్ప, యుగంధర్ పాల్గొన్నారు.

చేపల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

చేపల పెంపకం ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి కల్పించి ఆ కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డితో కలిసి బుక్కపట్నం చెరువులోకి 1.63 లక్షల చేప పిల్లలను వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల పెంపకం ద్వారా మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, రామ కృష్ణ, బుక్కపట్నం టిడిపి పట్టణ కన్వీనర్ వెంకట్రాముడు, చేపల సంఘం అధ్యక్షులు మురళి, నాయ కులు సాలెక్కగారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, డిపో భాస్కర్, పూల శివ, రాధమ్మ, భాగ్య, స్టోర్ డీలర్ మంజు, సుధీర్, కిరణ్ పాల్గొన్నారు.



బుక్కపట్నం చెరువులో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ఆసుపత్రి పరిశీలన

కొత్తచెరువులో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి భవనాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే నాణ్యతపై ఆరా తీసి, పనులు ఆలస్యం కావడంపై కాంట్రాక్టర్ రాజశేఖర్‌తో ఫోన్ ద్వారా ఆరా తీశారు. మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి పైకప్పు శిథిలావస్థకు చేరిందని డాక్టర్ అశ్వర్ధ నారా యణ ఎమ్మెల్యేకు తెలిపారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులు పండించిన కంది ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపో వద్దని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో నటరాజ్, టిడిపి నాయకులు పలిపి శ్రీనివాసులు, శ్రీనివాసులు, రామకృష్ణ, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమిష్టిగా పనిచేద్దాం : ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు : మండల అభివృద్ధికి సమిష్టిగా పని చేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, ఎంపీపీ పర్వీన్‌భాను, వైద్యాధికారి భానుప్రకాష్, ఈవోఆర్‌డి కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, పశు వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ సదాశివ, ఏపిఎం రవీంద్ర, హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ దీపికారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, సర్పంచులు గోవిందు, జగన్నాథ్ చౌదరి, రామచంద్ర, వెంకటరమణ, శంకర్‌రెడ్డి, బాబావృద్దీన్, అలీదర్‌షిక్, సాజియా ముజీబ్, రేణుక బాయ్, సెక్రటరీలు పాల్గొన్నారు.అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక దరికీ సబ్సిడీ లోన్లు ఇవ్వాలని కోరుతూ ఆరెసెస్ నియోజకవర్గ అధ్యక్షులు మున్నా రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్ర ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ : ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని జానకీ కళ్యాణ మండపం వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న మహమ్మదాబి అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉండగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆమె ఇంటికి వెళ్లి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును అందజేశారు. ఆమె వెంట జనసేన నాయకుడు అబ్దుల్ హుస్సేన్, నాయకులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం



నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులకు సహకరిం చాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కోరారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ కొత్త వ్యక్తులు అనుమానా స్పదంగా అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే బంగారం, డబ్బును బ్యాంకుల్లో ఉంచాలని, గ్రామ చివరగా ఉండే వారు ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రివేళ తలుపు తడితే అడిగిన తర్వాతే తెరవాలన్నారు. సాయంత్రం నడకకు వెళ్లేవారు బంగారు నగలు ధరించవద్దన్నారు. ఇళ్లకు తాళం వేయకుండా ఎక్కడికీ వెళ్లొద్దని సూచిం చారు. చోరీలు, ఇతర నేరాలను అరికట్టడంలో ప్రజలు సహకరించాలన్నారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

న్యాయ వ్యవస్థలోని అంశాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

న్యాయ వ్యవస్థలోని అంశాలను పారా లీగల్ వాలంటీర్లు ప్రజలకు వివరించాలని న్యాయ సేవా సంస్థ ఛైర్‌పర్సన్ జయలక్ష్మి సూచించారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. మండల న్యాయాధికారి సేవా సంస్థ ఛైర్‌పర్సన్, న్యాయమూర్తి ఎస్.జయలక్ష్మి ముఖ్యఅతిథిగా, సదస్సు సంధానకర్తలుగా న్యాయవాదులు కె.నర్సింహులు, లింగాల లోకేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. జడ్జి జయలక్ష్మి మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో కూడిన సేవా కార్యక్రమాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇందులో ఎలాంటి లాభాపేక్షకు తావు లేదన్నారు. ప్రజా సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల నుంచి రెడ్స్ భానుజా, ఎల్లప్ప, జన జాగృతి శ్రీనివాసులు, న్యాయవాదులు దశరథనాయక్, వెంకటేష్, సిరాజుద్దీన్, రఘునాథ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి జయలక్ష్మి

దారిని ఆక్రమించారని అధికారిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కొత్తచెరువు మండలంలోని బైరాపురం గ్రామ అంబేద్కర్ కాలనీకి వెళ్లే దారిని ఓ పోలీస్ అధికారి ఆక్రమించారని బాధితుడు సోమప్ప ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. సోమప్ప మాట్లాడుతూ అంబేద్కర్ కాలనీలో 1997లో ఇళ్ల పట్టాలు ఇచ్చారని, అయితే కాలనీకి వెళ్లే దారిని, పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన ఓ పోలీసు అధికారి ఆక్రమించుకొని ప్రహరీ ఏర్పాటు చేశారన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారున. ఈ విషయంపై కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. గతంలో వేసిన లేఅవుట్ ప్రకారం దారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

లంచం అడిగారని లైన్‌మెన్‌పై...

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న వేణుగోపాల్ పంచాయతీ వాటర్ షెడ్ డిపిని మార్చడానికి సర్పంచి జయమ్మను రూ. 12వేలు లంచం అడిగినట్లు శనివారం ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. లైన్‌మెన్ రైతుల నుంచి కూడా రూ. 15- రూ. 20 వేల దాకా లంచం తీసుకుంటున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

తడి, పొడి చెత్తపై అవగాహన

బుక్కపట్నం : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం తడి చెత్త, పొడి చెత్తపై యానిమేటర్లు, వివో సంఘాల లీడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల లీడర్లు ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తనే వేర్వేరుగా సేకరించాలని, చెత్త సంపద కేంద్రాల గురించి అవగాహన కల్పించాలన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పంచాయతీ కేంద్రాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచులు భాస్కర్‌రెడ్డి, నాగమణి, ఈఓఆర్‌డి అశోక్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల గోడపత్రిక విడుదల

పెనుకొండ : పట్టణంలోని భోగసముద్రం చెరువు వద్ద ఈ నెల 25, 26 తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు బిజెవిపిఎస్ (భోగసముద్రం జలవన పరిరక్షణ సమితి) సభ్యులు తెలిపారు. వారు శనివారం భోగసముద్రం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల గోడపత్రికను విడుదల చేశారు. సమావేశంలో అధ్యక్షులు పాపానాయుడు, సెక్రటరీ రాయల్ రమేష్, ట్రెజరర్ రాజశేఖర్ రెడ్డి, సభ్యులు చంద్రమౌళి, శివరాం, వినోద్ కుమార్, భాను రాము, రవికుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అమర్ విద్యామందిర్‌లో సైన్స్ డే

పరిగి : స్థానిక అమర్ విద్యామందిర్‌లో శనివారం సైన్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథులు గా ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం హాజరై విద్యార్థులు తయారుచేసిన రొబోటిక్స్ పరికరాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రొబోటిక్స్ వల్ల ఉత్తమ భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే రొబోటిక్స్ తయారీ, వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ డస్ట్‌బిన్, స్మార్ట్ టోల్ గేట్, మార్స్ రోవర్, ఫుట్‌బాల్ డ్రోన్, సెల్ఫ్ డ్రైవింగ్ కార్, ఎఐ ఆధారిత మానవ నృత్య ప్రదర్శనలు, తదితర ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు పాఠశాల నిర్వాహకులు అమానుల్లా తెలిపారు. సైన్స్ ఫెస్ట్‌లో బెల్లా పబ్లిక్ స్కూల్, దీప్తి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదానశిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం హిందూపురం ఏరియా ఆసుపత్రి సహకారంతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించామని ప్రిన్సిపల్ సురేష్‌బాబు తెలిపారు. శిబిరంలో 31 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని, తద్వారా పునర్జన్మ ఇచ్చిన వారమవుతామన్నారు. రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ చంద్రిక, డాక్టర్ నారాయణ, హెచ్ఐవి ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ మల్లికార్జున, శ్రీహరిబాబు, అంజి పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా. హరికృష్ణన్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్మాణ రూపకల్పన, నిర్మాణ విశ్లేషణ, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఉపయోగాన్ని ప్రాక్టికల్‌గా నేర్పారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ శిక్షణ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వాహనాల వేలం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 24వ తేదీ వాహనాల వేలం వేస్తున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు. 4 వాహనాలకు వేలం నిర్వహిస్తామని, పాల్గొనే వారు ఆధార్, పాన్‌కార్డ్‌తో హాజరు కావాలని, రూ. 1000 ధరావత్తు చెల్లించాలన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక ఎపి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాణాప్రతాప్‌నాయక్ తెలిపారు. ఈ నెల 25 నుంచి మార్చి 31వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ అర్హత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

ఆలయానికి విరాళం


ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందుకోసం డోలా రాజారెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు రూ. 5,016 విరాళంగా అందజేశారు.

రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-కొత్తచెరువు

పట్టణంలోని ప్రశాంతి రైల్వే స్టేషన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి ఆర్‌విజె ప్రశాంతి రైల్వేస్టేషన్ ఆటో యూనియన్ చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సాకే మాధవ, ఉపాధ్యక్షులు సుధాకర్, కోశాధికారి లక్ష్మీపతి, కార్యదర్శి కె.నాగరాజు పాల్గొన్నారు.




చలివేంద్రాన్ని ప్రారంభించిన సిఐటియు నాయకులు

బాలోత్సవ సంబరం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ వారం అనంత బాలోత్సవాలు పిల్లలకు పండుగను తెచ్చిపెట్టింది. అనంత బాలోత్సవాలు-5లో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చదువుల ఒత్తిడిలో ఇబ్బందులు పడుతున్న చిన్నారులకు మూడు రోజులపాటు జరిగిన ఈ ఉత్సవాలు కాస్త ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చాయి. తమను ప్రోత్సహిస్తే కళల్లో ఎంతో ప్రతిభను చాటి చూపగలమని ఈ మూడు రోజుల ఉత్సవాల్లో పిల్లలు నిరూపించారు. ఉపాధ్యాయులతోపాటు, తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఎంతో ఓర్పుతో ఇక్కడ జరుగుతున్న పోటీలకు తీసుకొచ్చారు. వేదికపై పిల్లలు చూపుతున్న ప్రదర్శనలను తిలికించి పరవశించారు. పిల్లలను ప్రతిభను చూస్తూ సంతోషపడడమే కాకుండా మొబైల్ ఫోనుల్లో వాటిని చిత్రీకరించుకుని ఆనందించారు. పిల్లల పండుగలా జరుగుతున్న ఈ వేడుకల్లో పెద్దలూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

జిల్లాలో చదువుల ఒత్తిడితో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషాధ ఘటన కూడా చోటు చేసుకుంది. ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి ఎస్ఆర్ కళాశాల వెనుకవైపు తోటలోకెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుల ఒత్తిడితోనే ఇది జరిగినట్టు భావిస్తున్నారు. అంతుకు మునుపు నెలలో నారాయణ కళాశాలలో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వరుసగా రెండు మాసాల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం విషాదకరం. చదువుల ఒత్తిడితో ఒకటి జరగ్గా, ఫీజు ఒత్తిడితో ఒకటి జరిగింది. ఇక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తమకు రక్షణ లేదని విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. కొత్తగా ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఇప్పటికి పూర్తి స్థాయి మౌలిక సదుపాయల కల్పన జరగలేదు. కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుల్లో ఈ విశ్వవిద్యాలయంపై సీతకన్ను వేసింది. దీంతో పనులు నత్తనడుకన సాగుతున్నాయి. ఈ పనులు జరుగుతున్న సమయంలోనే విద్యార్థులను అక్కడ చేర్చారు. దీంతో విద్యార్థినులకు భద్రత లేకుండాపోయింది. దీంతో ఆందోళన చెందుతున్నారు. తమకు రక్షణ కల్పించాలని నిరసనలకు దిగాల్సి వస్తోంది. అక్కడికి ఎంపి అంబికా లక్ష్మీనారాయణ వెళ్లి పరిశీలించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో చూడాల్సి ఉంది. కేంద్ర బడ్జెట్‌లోనూ వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించలేదు. ఈ విశ్వవిద్యాలయానికి ఒక్క రూపాయి నిధులివ్వలేదు. ఈ ఆందోళనలతోనైనా స్పందిస్తుందో లేదో చూడాల్సి ఉంది.



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని ఉపాధ్యయ దంపతుల ఇంట్లో గత నెల 20వ తేదీ జరిగిన ఓ చోరీ కేసులో అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు సిఐ రాఘవన్ తెలిపారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో శనివారం సిఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు బండి నాగార్జున ఇంట్లో సోహెల్ అలియాస్ సమీర్‌ఖాన్ 47 తులాల బంగారం, రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కర్నాటక, ఆంధ్ర, తెలంగాణలో విచారణ చేపట్టగా అనంతపురం నగరానికి చెందిన సోహెల్ బెంగళూరులో స్థిరపడి చోరీలు చేస్తున్నట్లు కనిపెట్టారు. అమెజాన్, ఫ్లిప్ కార్టు ద్వారా కొనుగోలు చేసిన పరికరాలతో చోరీ చేసిన బంగారాన్ని కలిగించి బిస్కెట్‌గా మార్చి హైదరాబాద్‌లో రూ. 29 లక్షలకు విక్రయించాడు. అత డు కర్నాటకలోని తుమకూరులో ఉన్నట్లు పసిగట్టి ఈ నెల 13వ తేదీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చారు. అనంతరం కోర్టు అనుమతితో ఈ నెల 19వ తేదీ పోలీస్ కస్టడీకి తీసుకొని విచారించారు. అలాగే హైదరాబాద్ వెళ్లి అతడు అమ్మిన దుకాణానికి వెళ్లి 350 గ్రాముల బంగారాన్ని(బిస్కెట్ రూపంలో) స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 250 గ్రాములు పెనుకొండలో చోరీ చేసిన ఉపాధ్యా యుడు నాగార్జునదే అన్నారు. మిగిలిన వంద గ్రాములు కుప్పంలో రెండు కేసుల్లో చోరీ చేసిన బంగారం అని తెలిపారు. అతడి నుంచి పల్సర్ బైక్, కీప్యాడ్, బంగారు ఆభరణాలు కరిగించడానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కర్నాటక, ఆంధ్ర, తదితర ప్రాంతాల్లో పలు కేసులు ఉన్నాయనన్నారు. నిందితుడు సోహెల్‌కు రేచీకటి ఉందని, కేవలం పగటిపూటే చోరీలు చేసేవాడు. చోరీ కేసును ఛేదించిన సిఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, కియా ఇండస్ట్రియల్ ఎస్ఐ రాజేష్, సిసిఎస్ సిఐ శివాంజనేయులు, ఎస్ఐ రాము, హెడ్ కానిస్టేబుల్స్ ఆదినారాయణ, కెబి. నాగరాజు, సుధాకర్, దస్తగిరి, రాము, ఆది, ఇతర సిబ్బందిని పెనుకొండ డీఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సిఐ రాఘవన్

ఆర్ఎంపిల పనితీరు మారాలి

ప్రజాశక్తి-పరిగి

మండలంలో ప్రథమ చికిత్స కేంద్రాలు నిర్వహిస్తున్న ఆర్ఎంపిలు పనితీరు మారాలని పిహెచ్‌సి డాక్టర్ స్వరూపారెడ్డి సూచించారు. ఆర్ఎంపిలు రోగులకు హై డోస్ మందులు వినియోగించడమే కాకుండా, గర్భనిరోధక మందులు, ఇంజక్షన్లు వేస్తున్నట్లు, అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేయడంపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఓ పిహెచ్‌సి డాక్టర్ లెటర్ ప్యాడ్‌ను వినియోగించి రోగులకు మందులు రాసివ్వడం, కాలం చెల్లిన మందులను వినియోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంపిలను శనివారం పిహెచ్‌సికి పిలిపించి హెచ్చరించారు. పనితీరు మార్చుకోవాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పిహెచ్‌సి వైద్యులు నవీన, ఊటుకూరు పిహెచ్‌సి వైద్యులు సురేష్ ఉన్నారు.



ఆర్ఎంపిలకు సూచనలు ఇస్తున్న డాక్టర్ స్వరూపారెడ్డి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని వేణువిద్యా విహార్‌లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం జరిగింది. దీనిని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కార్యదర్శి రియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సొంతంగా తయారు చేసిన ఆహార పధర్థాలను వారు పరిశీలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ జంక్ ఫుడ్, ఫాస్టు ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. సహజ సిద్ధమైన వంటకాల్లో ఎలాంటి పోషకాలు ఉంటాయని తెలిసేలా విద్యార్థులతో వంటకాలను సిద్ధం చేయించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ వేణు గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల ఆలోచనలే ఆదర్శం

ప్రజాశక్తి-హిందూపురం

మహనీయుల ఆలోచనలే ప్రపంచ ఆదర్శాలుగా నిలవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటేశులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల కవి జాన్ కిట్స్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అతి చిన్న వయసులోనే రచనల్లో అద్భుతాలు సష్టించి, ప్రపంచ ఆంగ్ల సాహిత్యంలో చెరగని ముద్రవేసిన జాన్ కిట్స్ అబ్రహాం మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు రంగనాయకులు, యన్‌సిసి ఆఫీసర్ సరస్వతి, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డా॥శ్రీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వెంకటేసులు

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు మూఢనమ్మకాలను విడిచి పెట్టి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని జెవివి అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆటో నగర్ సమీపంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ నాగమణి అధ్యక్షతన జెవివి నాయకులు సైన్స్‌పై అవగాహన కల్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. సైన్స్ లేనిదే జీవనం లేదన్నారు. మూఢ నమ్మకాలు ప్రగతికి ఆటంకాలన్నారు. కార్యక్రమంలో జెవివి ఉపాధ్యక్షులు రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలపై సమావేశం


ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లె గ్రామ పరిధిలోని కాటి కోటేశ్వర స్వామి క్షేత్రంలో ఈ నెల 26వ తేదీ నిర్వహించే మహా శివరాత్రి వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం చిల్లవారిపల్లెకు సంబంధించిన ఏడు కులాల కాపులు, ముఖ్యమైన వారితో సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మహేష్, డీఎస్పీ హేమంత్‌కుమార్ వారికి పలు సూచనలు చేశారు. అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సమన్వయం, ఐకమత్యంతో నిర్వహించుకోవాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ రంగారావు, తాడిమర్రి ఎస్ఐ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-లేపాక్షి

పెనుకొండ పట్టణంలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాలలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. బాబావలి మాట్లాడుతూ మహాసభల్లో విద్యారంగం, విద్యార్థుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళికలను రూపొంది స్తారన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నందీష్, నాయకులు రాజేష్, నవీన్, త్రివేంద్ర, తిలక్ పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వ్యాక్సిన్‌తో చిన్నారులకు రక్షణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని రంగేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని శనివారం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి సందర్శించి రికార్డులు, వ్యాక్సిన్ వేసే విధానాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు జబ్బుల బారిన పడకుండా వ్యాక్సిన్లు రక్షణ కల్పిస్తాయని, ప్రతి చిన్నారికి ఖచ్చితంగా క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులకు తప్పనిసరిగా టీకాలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, గౌతమి, ఆశా వర్కర్ జలజ, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

25న ఏపీఎంపీఏ జిల్లా వార్షికోత్సవ సదస్సు

ప్రజాశక్తి-హిందూపురం

అనంతపురం నగరంలో ఈనెల 25వ తేదీన ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రామీణ ప్రైవేట్ వైద్యుల వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ కార్యాలయంలో వ్యక్తిగత కార్యదర్శి బాలాజీకి ఆహ్వాన పత్రికను శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం పిఎ రాష్ట్ర అధ్యక్షుడు జిఎస్ ప్రసాద్, కార్యదర్శి సుధాకర్, సంయుక్త కార్యదర్శి వైడి.వర్మ, హిందూపురం డివిజన్ అధ్యక్షులు గోవిందరాజులు, కోశాధికారి ఆంజనేయులు, కన్వీనర్ షబ్బీర్ బాష పాల్గొన్నారు.

విద్యార్థులకు హ్యాండ్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాల క్రీడా మైదానంలో శనివారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ రమేష్‌బాబు విజేతలకు జ్ఞాపికలు, మెడల్స్ అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, క్రీడా స్ఫూర్తితో కలిసిమెలిసి ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జగదీష్, పిడి అజీమ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పి-4 సర్వే

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలో నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రయివేటు పీపుల్ పార్టనషిప్(పి-4) సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ స్వర్ణలత సూచించారు. బత్తలపల్లిలో వీఆర్వో రాణా ప్రతాప్ నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సర్వేలో భాగంగా ప్రభుత్వం ఎంపిక చేసిన ఇళ్లకు తప్పనిసరిగా వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఒ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, వీఆర్‌ఏ రాజా, తదితరులు పాల్గొన్నారు.

పొలంలో యువకుడి మృతదేహం

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షి నుంచి కంచిసముద్రం వెళ్లే దారిలో ఓ రైతు పొలంలో శనివారం యువకుడి మృత దేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. లేపాక్షి-కంచిసముద్రం దారిలో రోడ్డు పక్కనే పొలంలో ఉన్న టెంకాయ చెట్టు కింద ఓ యువకుడు పడిపోయి ఉండటాన్ని అటుగా వెళ్లిన వారు గమనించారు. దగ్గరికి వెళ్లి చూసి కంచిసముద్రం గ్రామానికి చెందిన నవీన్(23)గా గుర్తించారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హిందూ పురం ఆసుపత్రికి తరలించారు. నవీన్ తల్లిదండ్రులు చనిపోయారు. ఓ సోదరి మాత్రమే ఉంది. కేసు నమోదు చేశామని, అతడి మృతికి గత కారణాలను దర్యాప్తు చేసి వెల్లడిస్తామని ఎస్ఐ నరేంద్ర తెలిపారు.